సాక్షి ప్రకాశం


శుక్రవారం । 1 । ఆగస్టు । 2025



క్రీడాకారులతో కూటమి చెడుగుడు

గిరిజన క్రీడాకారుల భవిష్యత్తుతో కూటమి ప్రభుత్వం ఆటలాడుతోంది. స్పోర్ట్స్ స్కూళ్లలో అడ్మిషన్లు నిలిపివేసింది.

- 8లో..



సాగునీటికి సాగర్ జలాలు

జిల్లాలో సాగునీటికి సాగర్ జలాలు విడుదల చేశారు. ప్రధాన కాలువకు నీరు విడుదల చేయగా, రెండుమూడు రోజుల్లో మేజర్లకు సరఫరా చేయనున్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
35 /28

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. . వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీలో నియామకాలు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర ఐటీ విభాగ కమిటీలో ప్రకాశం జిల్లాకు చెందిన ముగ్గురు నాయకులను వివిధ హోదాల్లో నియమించారు. ఆ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటన విడుదల చేసింది. జనరల్ సెక్రటరీగా కొండపికి చెందిన ఆదిమూలపు విశాల్, సెక్రటరీగా మార్కాపురానికి చెందిన భీంపాటి శ్రీనివాసరెడ్డి, జాయింట్ సెక్రటరీగా యర్రగొండపాలేనికి చెందిన గుడ శ్రీధర్‌రెడ్డిని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు వన్‌టౌన్:

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాలలో 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకూ ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్ డి.జయ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికల విభాగంలో చీమకుర్తి గురుకుల విద్యాలయంలో 10వ తరగతిలో 6 సీట్లు, సీనియర్ ఇంటర్‌లో-8, సింగరాయకొండలో జూనియర్ ఇంటర్-19, సీనియర్ ఇంటర్-22, కంభంలో సీనియర్ ఇంటర్-13, దూపాడులో జూనియర్ ఇంటర్-30, సీనియర్ ఇంటర్-28, మార్కాపురంలో సీనియర్ ఇంటర్-6, కొండపిలో సీనియర్ ఇంటర్-5, రాచర్లలో 10వ తరగతి-4, సీనియర్ ఇంటర్-10 సీట్లు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. బాలుర విభాగంలో వెలిగండ్లలో 5వ తరగతిలో-31, 10వ తరగతిలో-10, జూనియర్ ఇంటర్‌లో-12, సీనియర్ ఇంటర్‌లో-45, అర్ధవీడులో 5వ తరగతిలో-27, 10వ తరగతిలో-7, జూనియర్ ఇంటర్‌లో-37, సీనియర్ ఇంటర్‌లో-47, దర్శిలో 10వ తరగతిలో-9, సీనియర్ ఇంటర్‌లో-9, కురిచేడులో 10వ తరగతిలో-11 పోస్టులు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అర్హత ఉన్న విద్యార్థులు సంబంధిత ప్రిన్సిపాళ్లను సంప్రదించి ప్రవేశాలు పొందవచ్చని సూచించారు.

ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

ఒంగోలు సిటీ:

ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే వెంకట్రావు, ప్రభాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రస్తుతం పనిచేస్తున్న 130 ఎయిడెడ్ పాఠశాలలకుగానూ కొన్ని ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా, ఉపాధ్యాయుల సంఖ్య చాలా తక్కువగా ఉందన్నారు. జిల్లాలోని 18 ఎయిడెడ్ పాఠశాలల్లో అసలు విద్యార్థులు లేక 48 మంది ఉపాధ్యాయులు మిగులుగా ఉన్నారని తెలిపారు. వీరితోపాటు జీవో నంబర్ వన్ ప్రకారం 102 మంది ఉన్నారని, వారిని ఇంకొల్లు మండలం తూర్పుగంగవరం ఓలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాల, ఇంకొల్లు మహిళా ఉన్నత ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు మిగులు ఉపాధ్యాయులను తీసుకునేందుకు అభ్యంతరం లేదని కలెక్టర్‌కు తెలియజేసి ఉన్నారని తెలిపారు. ఆ మేరకు ఆర్జేడీ కౌన్సిలింగ్ నిర్వహించి సర్దుబాటు చేయాలని కోరారు.

ట్రిపుల్ ఐటీలో ఉద్యోగాల పేరుతో మోసం

ఒంగోలు టౌన్:

ట్రిపుల్ ఐటీ కాలేజీలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి డబ్బులు వసూలు చేశాడని, డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే కులం పేరుతో దుషించాడని ఒంగోలుకు చెందిన ఒక యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం... ఒంగోలుకు చెందిన హిమబిందుకు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి దగ్గర పనిచేసిన బండి నవీన్‌తో పరిచయం ఉంది. ఈ క్రమంలో ట్రిపుల్ ఐటీలో అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నవీన్ నమ్మబలికాడు. దీంతో హిమబిందు రూ.3 లక్షలు ఇచ్చింది. అంతేకాకుండా తన స్నేహితులు మరో నలుగురికి పరిచయం చేసింది. వారంతా ఉద్యోగాలు వస్తాయన్న ఆశతో మొత్తం రూ.11 లక్షలు వసూలు చేశాడు. రోజులు గడుస్తున్నా ఉద్యోగం రాలేదు. ఈ లోపు హిమబిందు, నవీన్ మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో తమ వద్ద వసూలు చేసిన డబ్బులను ఇవ్వాలని అడిగేందుకు నవీన్ ఇంటివద్దకు వెళ్లింది. ఆగ్రహానికి గురైన నవీన్, అతడి భార్య డబ్బులు ఇవ్వకపోగా తనను కులం పేరుతో దూషించారని తాలూకా పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కన్నీటి ధారలు.. తీరువా కష్టాలు!

పిచ్చి చెట్లతో నిండిపోయిన పంటకాలువలు.. మరమ్మతులకు నోచుకోని చెరువులు.. సాగునీరందక అన్నదాత కంట కన్నీటి ధారలు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతన్నలకు అన్నీ కష్టాలే. ప్రధానంగా సాగునీటి రంగాన్ని పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. కరువుతో అల్లాడుతున్న రైతుకు ఇది శాపంగా మారింది. పెట్టుబడులు రాక..ప్రభుత్వం నుంచి సాయం అందక అన్నివైపులా నష్టపోయిన రైతుపై సాగునీటి తీరువా రూ.7.8 కోట్లు చెల్లించాలంటూ నోటీసులు ఇవ్వడం దారుణమంటున్నారు వ్యవసాయరంగ నిపుణులు



కురిచేడు మండలంలో కుచించుకుపోయిన వీరాయపాలెం మేజర్

- జిల్లాలో సాగునీటి రంగం గాలికి
- చెరువుల మరమ్మతులు పట్టని అధికారులు
- పిచ్చి చెట్లు, జమ్ముతో నిండిన పంట కాలువలు
- చెరువులు, కాలువల అభివృద్ధికి రూ.13.26 కోట్లతో ప్రతిపాదనలు
- ఫైలు తిప్పి పంపిన చంద్రబాబు ప్రభుత్వం
- కరువుతో అల్లాడుతున్న రైతుపై నీటితీరువా భారం
- 5,61,355 మంది రైతులు రూ.7.80 కోట్లు చెల్లించాలని నోటీసులు
- 6 శాతం వడ్డీతో రూ.44 లక్షలు అదనంగా చెల్లించాలంటూ వేధింపులు
- చంద్రబాబు వస్తున్నాడని హడావుడిగా సాగర్ కుడి కాలువకు నీళ్లు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: అసలే వెనుబడిన జిల్లా. దానికితోడు టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరం నుంచే జిల్లాలో కరువు కరాళ నృత్యం చేస్తోంది. అయినా టీడీపీ కూటమి ప్రభుత్వ పెద్దలకు కనీసం వ్యవసాయ రంగంపై కరుణ చూపించిన దాఖలాలు లేవు. జిల్లాలో చిన్నతరహా నీటి ప్రాజెక్టుల కింద 852 సాగునీటి చెరువులు ఉన్నాయి. వీటితో పాటు నాగార్జున సాగర్ ఆయకట్టు కింద కూడా పంటలు సాగుచేస్తున్నారు. ఇవికాకుండా ఎత్తిపోతల పథకాల ద్వారా కూడా పంటలు సాగవుతున్నాయి. వీటన్నింటి కింద జిల్లా వ్యాప్తంగా దాదాపు 9.50 లక్షలకుపైగా ఎకరాల్లో సాగు భూమి ఉంది. అయితే, ఇవన్నీ లెక్కల్లోనే ఉన్నాయి. చంద్రబాబు ప్రభుత్వం చెరువులు, కాలువల మరమ్మతులకు చిల్లి గవ్వ కూడా ఖర్చు చేయలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలో ఖరీఫ్, రబీ సీజన్లు కలిపి 6.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగుచేశారు. కరువుతో చివరకు 3 లక్షల ఎకరాల్లో కూడా పంటలు పండలేదు.

పిచ్చిచెట్లతో నిండిన సాగునీటి కాలువలు...

సాగునీటి చెరువులు, కాలువలు చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది. చిన్ననీటి పారుదల చెరువుల నుంచి పంటలకు నీరందించే నీటి సరఫరా కాలువలు సైతం పూడిపోయి పంట పొలాలకు సక్రమంగా నీరు చేరే పరిస్థితి లేకుండా పోయింది. ఇక వర్షం పడిందంటే కాలువల్లో నీరు ఎటుపడితే అటు వెళ్లిపోయి వృథాగా మారుతోంది. జిల్లాలోని చెరువుల నుంచి పొలాలకు నీటిని అందించే తూములు సైతం పూడిపోయి ఉన్నాయి. చెరువుల్లో బెడ్‌లెవల్స్ సైతం పూడికతో నిండిపోయాయి. ఇక, జిల్లాకు ప్రధాన సాగునీటి వనరైన సాగర్ కుడికాలువ పరిస్థితి మరీ దారుణం. సాగర్ ఆయకట్టు కింద దాదాపు 4 నుంచి 4.50 లక్షల ఎకరాల వరకు సాగు భూమి ఉంది. అయితే సాగర్ మేజర్ కాలువలు, మైనర్ కాలువలు పిచ్చి చెట్లతో, జమ్ము తూడుతో పూర్తిగా కనపడకుండా కనుమరుగైపోయాయి. సాగర్ నీరు వచ్చినా చివరి ఆయకట్టు వరకు నీరు చేరే పరిస్థితులు లేవు.

కరువుతో సహవాసం...

జిల్లా రైతాంగం కరువుతో సహవాసం చేస్తోంది. 2024-25 రబీ సీజన్‌లో 20 మండలాల్లో కరువు పీడించింది. ఖరీఫ్‌లోనూ పంటలు సక్రమంగా పండలేదు. దాంతో రైతులు నష్టపోయారు. జిల్లాలోని రైతాంగానికి టీడీపీ కూటమి ప్రభుత్వం నుంచి రూ.45.27 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ కింద పంట నష్టపరిహారం రావాల్సి ఉంది. అయినా చంద్రబాబు జిల్లాలోని రైతాంగానికి ఒక్క పైసా కూడా విదిల్చిందిలేదు. 2024-25లో రూ.15.88 కోట్లు, అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది రూ.29.39 కోట్లు, చంద్రబాబు ప్రభుత్వం జిల్లాలో పంటలు నష్టపోయిన రైతాంగానికి బకాయిపడింది.

నీటి తీరువా కట్టాలంటూ వేధింపులు...

కరువుతో అల్లాడుతున్న జిల్లా రైతాంగానికి నీటి తీరువా కట్టాలంటూ చేస్తున్న వేధింపులు శాపంగా పరిణమించాయి. ఇప్పటికే రెవెన్యూ అధికారుల ఇళ్లకు నోటీసులు పంపిస్తున్నారు. జిల్లాలోని ఒంగోలు, మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్ల పరిధిలో మొత్తం 5,61,355 మంది రైతులు రూ.7.80 కోట్లు నీటి తీరువా పన్ను కట్టాలని రైతులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇప్పటి వరకు కనిగిరి రెవెన్యూ డివిజన్‌లో మాత్రమే రూ.5.16 లక్షలు రైతులు చెల్లించారు. నీటి తీరువాతో పాటు ఆలస్యం అయ్యే కొద్దీ 6 శాతం వడ్డీతో సహా చెల్లించాలంటూ నోటీసులు పంపుతున్నారు. అసలుకు తోడుగా వడ్డీ తడిసి మోపెడైందన్న చందంగా రూ.44,10,971.37కు చేరుకుంది.



రెండు భారీ చిల్లపొదల మధ్యలో ఉన్న కొప్పోలు మేజర్ కాలువ

చంద్రబాబు వస్తున్నాడని సాగర్ నీరు విడుదల...

ముఖ్యమంత్రి చంద్రబాబు దర్శి వస్తున్నాడని రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు సాగర్ కుడి కాలువకు శ్రీశైలం డ్యాం నుంచి నీటిని వదిలారు. నాలుగైదు రోజుల నుంచి శ్రీశైలానికి వరద ఉధృతి తీవ్రంగా వస్తుండడంతో గేట్లు ఎత్తి నాగార్జున సాగర్‌కు నీళ్లొదిలారు. అయితే కరువుతో అల్లాడుతున్న ప్రకాశం జిల్లాకు సాగర్ నీటిని నాలుగు రోజుల క్రితమే విడుదల చేయాల్సి ఉంది. అయితే ఇరిగేషన్ ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాలేదు. ఇదిలా ఉండగా చంద్రబాబు పర్యటన ఖరారు కావడంతో హడావుడిగా బుధవారం డ్యాం నుంచి సాగర్ కుడికాలువకు నీరు వదిలారు. దాంతో జిల్లా బోర్డర్ సాగర్ కాలువ 85/3 కిలోమీటరు వద్దకు గురువారం సాయంత్రానికి నీళ్లు చేరుకున్నాయి. జిల్లా బోర్డర్ ముటుకుల వద్ద 2250 క్యూసెక్కుల నీరు కాలువ ద్వారా జిల్లాలోకి ప్రవేశించింది.

నీటి తీరువా వివరాలు....

రెవెన్యూ సబ్ డివిజన్	రైతు ఖాతాలు	కట్టాల్సిన మొత్తం (రూ)	వడ్డీ (6 శాతం..రూ)
మార్కాపురం	193270	1,13,99,488.05	6,83,969.28
కనిగిరి	228272	2,67,48,218.10	16,04,893.09
ఒంగోలు	139813	3,53,68,403.00	21,22,109.00
మొత్తం	561355	7,79,27,075.52	44,10,971.37

చెరువులు, కాలువల అభివృద్ధి ప్రతిపాదనలు వెనక్కి...

జిల్లాలోని సాగునీటి చెరువులు, కాలువల అభివృద్ధికి జిల్లా జలవనరుల శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వాటిని రాష్ట్ర ప్రభుత్వం కనీసం కనికరం కూడా లేకుండా వెనక్కి తిప్పిపంపింది. జిల్లా వ్యాప్తంగా 153 పనులను గుర్తించిన అధికారులు అందుకోసం సుమారు రూ.13.20 కోట్లు ఖర్చవుతుందని రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. వాటిని పట్టించుకోకుండా వెనక్కు తిప్పి పంపటంతో అధికారులు చేసేది లేక మిన్నకుండిపోయారు. అందులో ప్రధానంగా కొండపి అసెంబ్లీ నియోజకవర్గంలోని పాలేరు-బిట్రగుంట సప్లై చానల్ కింద 11 అభివృద్ధి పనులకు రూ.1.47 కోట్లు కేటాయించాలని పంపిన ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. ఎందుకంటే కొండపి నియోజకవర్గంలోని సంగమేశ్వరం ప్రాజెక్టుకు టీడీపీ పాలకులు మంగళం పాడి కనీసం ఉపయోగం లేకుండా చేశారు. కనీసం ఈ నిధులు వస్తే పీబీ చానల్ కింద చెరువులు బాగుపడతాయని, దాని కింద ఉన్న 9 చెరువుల పరిధిలోని 9,500 ఎకరాలకుపైగా పంట పొలాలు సస్యశ్యామలం అవుతాయని రైతులు కూడా భావించారు.



దట్టంగా పెరిగిపోయిన జమ్ముతో నాగార్జున సాగర్ కొప్పోలు మేజర్ కాలువ

ఆయకట్టు బీడుగా



మా వేమవరం గ్రామంలోని చెరువు కింద ఆయకట్టు అంతా బీడుగా మారింది. చెరువుకు పై ఎత్తున అడ్డుకట్టలు వేయడంతో చెరువులోకి చుక్క నీరు రావడంలేదు. అలాగే చెరువు లోపల, కట్టపై పిచ్చిచెట్లు మొలిచాయి. పంట కాలువలు లేవు. రైతులు వరి సాగు చేయడం లేదు. చెరువుకు మరమ్మతులు చేసి నీరు చెరువులోకి వచ్చే విధంగా చూడాలి.

– కొమ్ము యోమాను, వేమవరం

పంట కాలువలు లేవు



కెల్లంపల్లి పంచాయతీ పరిధిలోని మిస్సమ్మ చెరువు అధ్వానంగా ఉంది. వర్షం నీరు చెరువులో ఉన్నప్పటికీ తూములు, పంట కాలువలు సక్రమంగా లేకపోవడంతో రైతులు ఆయకట్టు కింద పంటలు పండించుకోలేకపోతున్నారు. దీనికితోడు చెరువులో, చెరువు కట్టపై పిచ్చిచెట్లు పెరిగిపోయాయి. దీంతో చెరువుకట్ట బలహీనంగా మారింది. చెరువుకు ఉన్న అలుగు దెబ్బతింది.

– చెరుకూరి శ్రీనివాసులు, కెల్లంపల్లి

మేజర్లను బాగుచేయాలి



సాగర్ కాలువలు చెట్లతో నిండి పోయి ఉన్నాయి. సాగుకు నీరిచ్చినా.. అవి రైతుల పొలాలకు చేరవు. మేజర్ల కట్టలు కూడా గండ్లుపడి ఉన్నాయి. మేజర్లలోని చెట్లు, గడ్డి తొలగించి కట్టలు బలోపేతం చేయాలి.

– పూట్ల వెంకటేశ్వర్లు, కురిచేడు

ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

- లో గ్రేడ్ పొగాకు కొనుగోలు చేయించాలి
- రూ.1000 కోట్లు కేటాయించి రైతులను ఆదుకోవాలి
- పొగాకు ఆర్‌ఎం కార్యాలయం వద్ద రైతుల ధర్నా



ఒంగోలు పొగాకు బోర్డు కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న రైతు సంఘ నేతలు, పొగాకు రైతులు

ఒంగోలు సబర్బన్: లో గ్రేడ్ పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం జోక్యం చేసుకుని ప్రభుత్వ రంగ సంస్థలచే కొనుగోలు చేసేందుకు చొరవ చూపాలని పలువురు రైతు సంఘ నేతలు డిమాండ్ చేశారు. గురువారం ఒంగోలులోని పొగాకు బోర్డ్ ఆర్‌ఎం కార్యాలయం వద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. లో గ్రేడ్ పొగాకు కొనుగోలుకు రూ.1000 కోట్లు కేటాయించాలని, క్వింటా రూ.20 వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు జుజ్జూరు జయంతిబాబు అధ్యక్షతన జరిగిన ధర్నాలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకటరావు మాట్లాడుతూ ఈ ఏడాది వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా వర్జీనియా పొగాకు రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందన్నారు. కంపెనీలు, బోర్డు సూచనలకు అనుగుణంగా సాగు చేసిన రైతుకు సరైన దిగుబడులు రాక, గిట్టుబాటు ధర లభించక, వేలం కేంద్రాల్లో కొనుగోళ్ల జరక్క తీవ్రంగా ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరుతో బ్యారన్‌కు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రైతాంగం ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. జిల్లాలో ఈ పాటికే మిర్చి, నల్ల బర్లీ పొగాకు రైతులు 12 మంది వరకు ఆత్మహత్యలకు పాల్పడ్డారని గుర్తు చేశారు. భరోసా కల్పించాల్సిన బోర్డు, ప్రభుత్వం నెలన్నరగా ఆందోళన చేపట్టినా స్పందించలేదన్నారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో 45 శాతం బేళ్లు తిప్పి పంపడం వల్ల కొంటారో, కొనరోనని రైతులు ఆందోళన చెందుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది మంత్రులు, బోర్డు చైర్మన్, ఈడీ అనేక సార్లు పర్యటించడం వల్ల రైతులు ఆశగా ఎదురు చూశారన్నారు. ఇకనైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని లో గ్రేడ్ కొనుగోలుకు రూ.1000 కోట్లు కేటాయించాలని, పెనాల్టీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

గత సంవత్సరం 140 మిలియన్ కిలోల కొనుగోలు...

జయంతి బాబు మాట్లాడుతూ గత సంవత్సరం 140 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు చేసిన యంత్రాంగం.. ఈ ఏడాది మరో 40 మిలియన్ కిలోలకు అనుమతిచ్చినందునే అధికంగా సాగు చేశారని అన్నారు. బోర్డు చైర్మన్ 240 మిలియన్ కిలోలుగా వక్రీకరించినట్లు ఆరోపించారు. కేవలం సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. బోర్డుచైర్మన్, ఈడీ కంపెనీలకు వత్తాసు పలుకుతున్నట్లు ఆరోపించారు. ధరలు దిగజార్చి కంపెనీలకు మేలు చేసే విధంగా బోర్డు యంత్రాంగం కుట్రపన్నుతోందని దుయ్యబట్టారు. ప్రభుత్వం లో గ్రేడ్ పొగాకు రూ.20 వేలకు తగ్గకుండా కొనుగోలు చేయించాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఎస్టీసీతో పాటు పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్యను రంగంలోకి దించాలన్నారు. గతంలో కొనుగోలు చేసిన ప్రభుత్వ సంస్థలకేమీ నష్టం వాటిల్లలేదని, లాభపడ్డాయని గుర్తు చేశారు. అనంతరం రీజినల్ మేనేజర్ శీలం రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఆగస్టు మొదటి వారంలో బోర్డు ఉన్నతాధికారుల సమావేశం జరగనుందని, ఆ సమావేశంలో పొగాకు సమస్యపై చర్చించడం జరుగుతుందని ఆయన హామీ ఇచ్చారు. తూబాటి శ్రీకాంత్ ధర్నాను ప్రారంభించగా, సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పెంట్యాల హనుమంతరావు, తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బూరి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి బెజవాడ శ్రీనివాసరావు, నాయకులు కిలారి పెద్దబ్బాయి, కురిచేటి హనుమంతరావు, కొల్లూరు వెంకటేశ్వర్లు, చిలుకూరి వెంకట్రావు, పోలవరపు జనార్దన్‌రావు, దాసరి ఆంజనేయులు, నార్నే చెంచయ్య, మొలకలపల్లి కోటేశ్వరరావు, చెరుకూరి వాసు, తోకల శేషారావు, గాదె నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ పదవికి మూడు నామినేషన్లు

కొండపి: కొండపి పంచాయతీ సర్పంచ్ అభ్యర్థులుగా గురువారం ముగ్గురు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి రవిబాబు తెలిపారు. బుధవారం తొలి రోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని, గురువారం రెండో రోజు మూడు నామినేషన్లు, వార్డులకు 10 నామినేషన్లు దాఖలయ్యాయని వెల్లడించారు. 1, 2, 3, 5, 9, 11, 12, 14 వార్డులకు ఒక్కొక్క అభ్యర్థి నామినేషన్లు వేశారన్నారు. ఎనిమిదో వార్డుకు ఇద్దరు అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేశారన్నారు. నాలుగు, ఆరు, ఏడు, పది, పదమూడు వార్డులకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు నామినేషన్ల ప్రక్రియ ముగుస్తుందని చెప్పారు.

ఫిషింగ్ హార్బర్ స్థల పరిశీలన



ఫిషింగ్ హార్బర్‌కు స్థలాన్ని పరిశీలిస్తున్న మత్స్యకార కమిషనర్ రామశంకర్ నాయక్

కొత్తపట్నం: ఫిషింగ్ హార్బర్ స్థలాన్ని మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్ గురువారం పరిశీలించారు. కొత్తపట్నం మండలంలోని కె.పల్లెపాలెం గ్రామంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017-18లో హార్బర్ మంజూరైందని, స్థలం కేటాయింపులో సమస్యలతో నిలిచిపోయిందని అన్నారు. సుమారు రూ.400 కోట్లతో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రంగం సంసిద్ధమైందని తెలిపారు. గ్రామ పెద్దల సమక్షంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఫిషింగ్ హార్బర్‌తో కలిగే లాభాలు, అవసరాల గురించి వివరించారు. ఫిషింగ్ హార్బర్ ఏర్పాటైతే పెద్ద పడవలు వస్తాయని, వాటి ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని, అలాగే మత్స్యకారుల స్థితిగతులు మారతాయని తెలిపారు. సబ్సిడీ ద్వారా కూడా పెద్ద పడవలు అందించే అవకాశం ఉందన్నారు. ఫిషింగ్ హార్బర్ కావాలంటే స్థలం కావాలని, దానికి అందరి సహకారం అవసరమని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి సోనా బోట్లు వచ్చి తమ సంపదను కొల్లగొడుతున్నాయని మత్స్యకారులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన స్పందించారు. డ్రోన్ కెమెరాలతో వాటిని గుర్తించి కఠిన చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలోని మత్స్యకారులు సుమారు 350 పడవలతో జీవనం కొనసాగిస్తుండగా, మత్స్య సంపద ఎలా వస్తుందని కమిషనర్ ఆరా తీశారు. మరో వారంలో పూర్తిగా ఫిషింగ్ హార్బర్ స్థలం ఏర్పాటు గురించి సంబంధిత అధికారులతో చర్చించి స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎండీ నగేష్, జాయింట్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, ఏడీ ఇన్‌చార్జి ఎస్.శ్రీనివాసరావు, భాస్కర్, ఎఫ్‌డీవో ఆషా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వరకుమార్, సర్వేయర్ సుధీర్‌బాబు, మత్స్యశాఖ యూనియన్ అధ్యక్షుడు పేరయ్య, శ్రీను, జక్రయ్య, ఎంపీటీసీ సభ్యుడు నరసింహారావు, గ్రామ పెద్దలు, మత్స్యకారులు పాల్గొన్నారు.

ఏకేయూ పీజీ ఫలితాలు విడుదల



పీజీ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు

ఒంగోలు సిటీ: ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలోని పీజీ కళాశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను ఏకేయూ వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు గురువారం సాయంత్రం విడుదల చేశారు. ఈ పరీక్షలకు మొత్తం 1037 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, వారిలో 929 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. వారిలో 770 మంది విద్యార్థులు 82.8 శాతం మేరకు ఉత్తీర్ణత సాధించినట్లు ఆంధ్రకేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు తెలిపారు. ఈ ఫలితాలలో హిస్టరీ, ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్ తదితర విభాగాలలో పరీక్షలు రాసిన విద్యార్థులు నూరు శాతం పాసయ్యారని చెప్పారు. యూనివర్సిటీ స్థాయిలో, ఆయా కళాశాలల స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఏకేయూ ఉప కులపతి ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు, సీఈ ప్రొఫెసర్ జి.సోమశేఖర, ఏసీఈ డాక్టర్ ఏ భారతీదేవి తదితరులు అభినందించారు. కార్యక్రమంలో పీజీ కో ఆర్డినేటర్ (నాన్ కాన్ఫిడెన్షియల్) డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఏసీఈ సహాయకులు డాక్టర్ ఎన్.సురేష్, పరీక్షల విభాగం పర్యవేక్షకుడు సూడా శివరామ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు 49 మంది ఎంపిక



సౌత్‌జోన్ అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపికైన విద్యార్థులు

యర్రగొండపాలెం: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అడక్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక గిరిజన గురుకుల పాఠశాలలో గురువారం జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలో 49 మంది ఎంపికయ్యారు. జిల్లా నలు మూలల నుంచి దాదాపు 200 మంది ఎంపికలో పాల్గొన్నారని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.రామచంద్రరావు, ఎం.వెంకట రెడ్డి తెలిపారు. పాల్గొన్న వారిలో అండర్-14లో 12 మంది, అండర్-16లో 28 మంది, 18, 20 ఏళ్ల యువతీ, యువకులు 9మంది ప్రకారం ఎంపికయ్యారని, వీరు బాపట్ల జిల్లా చీరాలలో జరిగే 36వ జూనియర్ సౌత్‌జోన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు.



హై జంప్ చేస్తున్న విద్యార్థి

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

మార్కాపురం: ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన గురువారం మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. పెద్దారవీడు గ్రామానికి చెందిన వేశపోగు ఏసమ్మ(72) ప్రతి రోజు ఉదయం పూట మార్కాపురం వచ్చి కూరగాయలు కొనుగోలు చేసి పెద్దారవీడు ప్రాంతంలో అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో బుధవారం ఆమె మార్కెట్‌కు వచ్చి కూరగాయలు కొనుగోలు చేసి తీసుకువెళుతున్న క్రమంలో ఎదురుగా వచ్చిన ఆటో ఏసమ్మను ఢీకొట్టింది. ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో స్థానిక జీజీహెచ్‌లో ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాంకేతిక సమస్యతో నిలిచిన గూడ్స్ రైలు



గేటు వద్ద గూడ్స్ రైలు బోగీలు నిలవడంతో స్తంభించిన ట్రాఫిక్

గిద్దలూరు రూరల్: సాంకేతిక సమస్యతో గూడ్ రైలు నిలిచిపోయింది. ఈ సంఘటన పట్టణంలోని రాచర్ల గేటు వద్ద గురువారం మధ్యాహ్నం జరిగింది. వివరాల్లోకి వెళితే.. గుంటూరు నుంచి గుంతకల్ వైపుగా వెళ్లే గూడ్స్ రైలు ఇంజన్‌లో సాంకేతిక మరమ్మతుల కారణంగా రాచర్ల గేటు వద్ద సుమారు అరగంట సేపు నిలిచిపోయింది. దీంతో పట్టణంలోని రాచర్ల గేటు దాటి అవతలి వైపుకు వెళ్లే వాహనదారులు రోడ్డు పై అలాగే నిలిచిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అర గంట తరువాత ఇంజన్‌లో మరమ్మతులు చేయడంతో రైలు ముందుకు కదిలింది. దీంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

క్రీడా కుసుమాలను వెలికితీయాలంటే క్షేత్ర స్థాయిలో యువతను ప్రోత్సహించాలి. మట్టిలో మాణిక్యాలకు తగిన శిక్షణ ఇచ్చి క్రీడా నైపుణ్యాన్ని మెరుగుపరచాలి. ఇదే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గిరిజన విద్యార్థుల కోసం స్పోర్ట్స్ స్కూళ్లను ఏర్పాటు చేసింది. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్దేందుకు కోచ్‌లను నియమించింది. అయితే కూటమి ప్రభుత్వం గద్దెనెక్కగానే గిరిజన విద్యార్థుల క్రీడావకాశాలపై దెబ్బకొట్టింది. స్పోర్ట్స్ స్కూళ్లలో అడ్మిషన్లు సైతం నిలిపేసి భావి క్రీడాకారుల జీవితాలతో చెడుగుడు ఆడుకుంటోంది.

క్రీడాకారులతో కూటమి చెడుగుడు!



స్పోర్ట్స్ స్కూల్లో శిక్షణ పొందుతున్న గిరిజన విద్యార్థులు

- క్రీడల్లో గిరిజన విద్యార్థులు ప్రతిభ కనబరచకుండా సర్కారు అడ్డుపుల్ల
- అగమ్యగోచరంగా రాష్ట్రంలోని 6 స్పోర్ట్స్ స్కూళ్ల పరిస్థితి
- తమ పిల్లలను చిన్నచూపు చూడటం తగదని గిరిజన సంఘ నేతల మండిపాటు

స్పోర్ట్స్ స్కూళ్లలో అడ్మిషన్లు నిలిపేసిన రాష్ట్ర ప్రభుత్వం

యర్రగొండపాలెం: గిరిజన విద్యార్థుల్లో దాగిఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచే విధంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అరకులో ఉన్న ఏపీటీడబ్ల్యూఆర్ స్పోర్ట్స్ స్కూల్‌కు అనుబంధంగా రాష్ట్రంలో ఆరు క్రీడా పాఠశాలకు శ్రీకారం చుట్టారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట(బాలురు), భద్రగిరి(బాలికలు), తూర్పు గోదావరి జిల్లాలోని ముసురుమిల్లి(బాలురు), ప్రకాశం జిల్లాలోని యర్రగొండపాలెం (పీటీజీ-బాలురు), నంద్యాల జిల్లాలోని మహానంది(బాలికలు), అనంతపురం జిల్లాలోని గొల్లలదొడ్డి(బాలురు)లో 6 స్పోర్ట్స్ స్కూళ్లను ప్రారంభించారు. ఆయా పాఠశాలల్లో 720 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఆటల పోటీల్లో ప్రతిభాపాటవాలు ప్రదర్శించే అవకాశం కల్పించారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ, గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ విద్యా సంస్థలు సంయుక్తంగా నిర్వహించే ఈ స్పోర్ట్స్ స్కూళ్లను 2022లో ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఒక్కో ఈవెంట్‌కు ఒకరు చొప్పున 23 మంది కోచ్‌లను నియమించారు. దీంతో గిరిజన విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న పాఠశాలల్లో చేరి నైపుణ్యాన్ని పెంపొందించుకున్నారు. అనేక మంది విద్యార్థులు జిల్లా స్థాయితో పాటు అంతర్జాతీయ స్థాయి వరకు ఈ స్పోర్ట్స్ స్కూల్స్ ద్వారా ఎదగ గలిగారు.



వివిధ క్రీడాంశాలకు సంబంధించిన పాఠశాలలు

పాఠశాల	క్రీడలు
సీతంపేట(బాలురు), పార్వతీపురం మన్యం	ఆర్చరీ, అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, వాలీబాల్
భద్రగిరి(బాలికలు), పార్వతీపురం మన్యం	అథ్లెటిక్స్, హాకీ, జూడో, వెయిట్‌లిఫ్టింగ్
ముసురుమిల్లి(బాలురు), తూర్పుగోదావరి	ఆర్చరీ, అథ్లెటిక్స్, బాక్సింగ్, ఫుట్‌బాల్
యర్రగొండపాలెం(బాలురు), ప్రకాశం	ఆర్చరీ, అథ్లెటిక్స్, హాకీ, వాలీబాల్
మహానంది(బాలికలు), నంద్యాల	ఆర్చరీ, అథ్లెటిక్స్, టేబుల్ టెన్నిస్
గొల్లలదొడ్డి(బాలురు), అనంతపురం	అథ్లెటిక్స్, బాక్సింగ్, ఫుట్‌బాల్, వెయిట్‌లిఫ్టింగ్

అడ్మిషన్లకు మంగళం

క్రీడా పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులకు గత ప్రభుత్వంలో ప్రత్యేక పరీక్షలు నిర్వహించి అడ్మిషన్లు ఇచ్చేవారు. గిరిజనుల పిల్లలు క్రీడా ప్రతిభను కనబరిచేందుకు వేదికలుగా ఉన్న ఈ పాఠశాలలపై కూటమి ప్రభుత్వం కన్నెర్రజేసింది. ప్రభుత్వం ఏర్పడి దాదాపు 14 నెలలు కావస్తున్నప్పటికీ స్పోర్ట్స్ స్కూళ్లలో ఒక్క గిరిజన విద్యార్థికీ అడ్మిషన్ ఇచ్చిన పాపానపోలేదు. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే గిరిజన విద్యార్థులను కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందనిపిస్తోందని వైపాలేనికి చెందిన గిరిజన నాయకుడు ఆవేదన వ్యక్తం చేశారు. 6 స్పోర్ట్స్ స్కూళ్లలో కోచ్‌లు ఉన్నప్పటికీ విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వకపోవడమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. స్పోర్ట్స్ స్కూళ్లలో అడ్మిషన్లు లేకపోవడం వల్ల గిరిజన విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించే అవకాశం కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన పిల్లలు క్రీడల్లో ఎదగకుండా ఈ ప్రభుత్వం ఎందుకు ఆటంకం కలిగిస్తోందో అర్థం కావడం లేదని, తమ పిల్లలను ఉన్నత స్థాయిలో చూసుకునే అవకాశం కల్పించకపోవడం శోచనీయమని వారు అంటున్నారు. వెంటనే రాష్ట్రంలో ఉన్న 6 స్పోర్ట్స్ స్కూళ్లలో గిరిజన విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

పొలాలకు సాగర్ జలాలు



విశ్వనాథపురం రెగ్యులేటర్ ప్రధాన కాలువ 101 మైలు వద్ద సాగర్ నీటి సరఫరా



సాగర్ ప్రధాన కాలువను పరిశీలించి అధికారులతో చర్చిస్తున్న సీఈ శ్యామ్ ప్రసాద్

- జిల్లా ప్రధాన కాలువకు నీటి సరఫరా
- రెండు మూడు రోజులలో మేజర్లకు నీటి విడుదల

త్రిపురాంతకం: నాగార్జున సాగర్ ప్రధానకాలువకు సాగర్ జలాలు విడుదలయ్యాయి. సాగర్ జలాశయానికి ఎగువ భాగం నుంచి నీటి ప్రవాహం కొనసాగుతుండటంతో సాగునీటిని విడుదల చేశారు. ప్రకాశం జిల్లాకు 2600 క్యూసెక్కులు జిల్లా సరిహద్దులో చేరుతోంది. ఈఏడాది సకాలంలో కృష్ణా ఎగువ ప్రాంతంలో వర్షాలు కురిసి సకాలంలో జలాశయాలు నిండటంతో సాగునీటి సరఫరాకు అనుకూలంగా మారింది. జిల్లా సరిహద్దు 85 మైలు వద్ద గురువారం తెల్లవారుజామున 1750 క్యూసెక్కుల నీరు చేరగా, సాయంత్రానికి 2600 క్యూసెక్కులు పెరిగినట్లు సాగర్ కాలువల డీఈ విజయలక్ష్మి తెలిపారు. సాగర్ ప్రధానకాలువ, రామతీర్థం వరకు నీరు చేరిన తదుపరి మేజర్లకు నీటిని విడుదల చేయనున్నట్లు ఆమె తెలిపారు. రెండు మూడు రోజులలో సాగునీటి సరపరా పెరిగి మేజర్లకు సాగునీటిని అందించనున్నారు. పూర్తి స్థాయిలో సాగర్ ప్రధాన కాలువ ద్వార సాగునీటిని చివరి భూములకు ఎలాంటి ఆటంకం లేకుండా సరఫరా చేయాల్సిన అవసరం ఉంది.

నీటి సరఫరాను పరిశీలించిన సీఈ

నాగార్జున సాగర్ ప్రధానకాలువ నీటి సరఫరాను చీఫ్ ఇంజినీర్ బి.శ్యామ్ ప్రసాద్ పరిశీలించారు. ముందుగా తాగు నీటి చెరువులను నింపాలని అధికారులకు సూచించారు. త్రిపురాంతకం మండలం దూపాడు సాగర్ ప్రధాన కాలువపై సీఈ పర్యటించి అధికారులతో సాగర్ నీటి సరఫరాపై ఆరా తీశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమన్వయం చేసుకుని చెరువులు నింపాలన్నారు. సాగునీటి సరఫరా, ఆయకట్టు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట డీఈ విజయలక్ష్మి, ఏఈలు శ్రీమన్నారాయణ, భరత్, డిస్ట్రిబ్యూటరి కమిటీ చైర్మన్ చలమయ్య ఉన్నారు.

బాబు రాక.. జేబుకు చిల్లు..!

దర్శి: 'అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించేందుకు సీఎం దర్శి మండలానికి రావడమేంటో.. మా జేబులకు చిల్లు పెట్టడమేంటో..' అని ఇక్కడి సచివాలయ ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. ముఖ్యమంత్రి వస్తుంటే ఖర్చులకు అవసరమైన నగదు ఖజానా నుంచి తీసుకోవాలి కానీ ఉద్యోగుల దగ్గర వసూలు చేయడమేంటని తమ సన్నిహితుల వద్ద వాపోతున్నారు. సీఎం చంద్రబాబు ఈ నెల 2న దర్శి మండలంలోని తూర్పువీరాయపాలెం వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఖర్చుల పేరుతో ఒక్కో సచివాలయ ఉద్యోగి వద్ద రూ.2 వేల నుంచి రూ.2,500 వసూలు చేయాలని నియోజకవర్గంలోని ఓ ఎంపీడీఓ స్థాయి అధికారి ఆదేశించి నట్లు సమాచారం. దీంతో గ్రామ కార్యదర్శులు తమ పరిధిలోని సిబ్బందికి గ్రూపుల్లో ఇండైరెక్ట్‌గా ఆదేశాలు జారీ చేయడం చర్చనీయాంశమైంది. ఈ విషయం ఆనోటా ఈనోటా బయటకు పొక్కడంతో 'ఇదేం కక్కుర్తి బుద్ధి' అని సామాన్య ప్రజలు సైతం చీదరించుకుంటున్నారు. అసలు ఈ వసూళ్లు కూటమి నేతల పనా? లేక అధికారుల అత్యుత్సాహమా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

దివ్యాంగురాలి ఆత్మహత్యాయత్నం

- ఎస్సై దురుసు ప్రవర్తన కారణమంటున్న దివ్యాంగురాలు

సింగరాయకొండ: మండలంలోని కలికవాయ గ్రామానికి చెందిన అంకమ్మ తనకు పోలీస్‌స్టేషన్‌లో న్యాయం జరగకపోగా ఎస్సై బి. మహేంద్ర దురుసుగా ప్రవర్తించారని మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం కలికవాయ గ్రామానికి చెందిన కుంచాల అంకమ్మకు, ఆమె ఇంటి ఎదురుగా ఉన్న వ్యక్తితో రెండేళ్లుగా విభేదాలు ఉన్నాయి. గతంలో సదరు వ్యక్తి కాలు విరగ్గొట్టుకుని ఆ కాలును ఇనుకరాడ్డుతో విరగ్గొట్టానని తనపై అక్రమ కేసు బనాయించాడని అంకమ్మ ఆరోపించింది. ఇటీవల కాలంలో ప్రతిరోజు తాగి వచ్చి తనను దుర్భాషలాడుతున్నాడని, ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని వాపోయింది. తాను ఇచ్చిన ఫిర్యాదును ఎస్సై పక్కన పెట్టి తన ఎదురింటి వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశాడని, ఇదేమని అడిగితే తనను దుర్భాషలాడాడని, తనకు న్యాయం జరగదని భావించి ఆత్మహత్యానికి పాల్పడ్డానని అంకమ్మ తెలిపింది. దీనిపై ఎస్సై బి.మహేంద్రను వివరణ కోరగా ఇద్దరి మధ్య రెండేళ్లుగా తగాదాలు ఉన్నాయని, కేసులు కూడా ఉన్నాయని తెలిపారు. తాజాగా ఇద్దరూ గొడవ పడి స్టేషన్‌కు వస్తే ఇద్దరిని తహశీల్దార్ వద్ద బైండోవర్ చేస్తానని చెప్పానన్నారు. ఈ లోపు భోజనం చేసి రమ్మని చెప్పానని, అయితే ఈ లోపు అంకమ్మ ఆత్మహత్యకు పాల్పడిందని వివరించారు.

బయ్యర్లు కొంటుంటే వద్దంటావేంటి?

- పొదిలి పొగాకు వేలం కేంద్రంలో రైతు ఆందోళన



టుబాకో బోర్డు చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతు చంద్రశేఖర్

పొదిలి: వేలానికి ఉంచిన బేళ్లను బయ్యర్లు కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చినా బోర్డు నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్ అడ్డుకుంటున్నారంటూ ఓ రైతు ఆందోళనకు దిగారు. పొదిలి పొగాకు వేలం కేంద్రంలో గురువారం చోటుచేసుకున్న ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. పొదిలి పొగాకు వేలం కేంద్రానికి మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ఆరు బేళ్లను తీసుకొచ్చారు. మొత్తం బేళ్ల తిరస్కరణకు గురికావడంతో వేలం నిర్వహణాధికారి తీరుపై రైతు ఆగ్రహించారు. ఇలాగైతే రైతులకు న్యాయం ఎలా చేస్తావని ప్రశ్నించడంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో రైతును బయటకు వెళ్లాలంటూ నిర్వహణాధికారి హెచ్చరించారు. తనకు జరిగిన అన్యాయం, వేలం అధికారి తీరుపై పొగాకు బోర్డు చైర్మన్‌కు రైతు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. మంచి పొగాకును కూడా లోగ్రేడ్‌గా నిర్ణయించి రైతుల పొట్టకొడుతున్నారని చంద్రశేఖర్ ఆరోపించారు. తాను తెచ్చిన బేళ్లలో కొన్ని కొనడానికి బయ్యర్లు ముందుకొస్తే అవి వద్దని వేలం అధికారి అడ్డుతగిలారని వివరించారు. చివరికి బయ్యర్లను బతిమలాడి ఒప్పించి బేళ్లను అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందని రైతు చంద్రశేఖర్ వాపోయారు. ఇదిలా ఉండగా వేలం అధికారి తమను చిన్న చూపు చూస్తూ బేళ్లను సగానికి సగం వెనక్కి పంపుతుండటంతో వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయులకు అవమానం!

- ఎంఈఓ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పెత్తనం
- కించపరిచేలా మాట్లాడుతుండటంపై టీచర్ల ఆగ్రహం

ఒంగోలు సిటీ: ఒంగోలు మండల విద్యాశాఖ కార్యాలయంలో సిబ్బంది పనితీరు వివాదాస్పదంగా మారింది. కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఒకరు సీనియర్ ఉపాధ్యాయులపై పెత్తనం చెలాయిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల విద్యాశాఖ అధికారి చేయాల్సిన పనులను సైతం సదరు ఉద్యోగి చక్కబెడుతూ తమను కించపరిచే విధంగా వ్యవహరిస్తున్నాడని ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. మండల పరిధిలోని అన్ని స్కూళ్లలో తన మాటే చెల్లుబాటుకావాలన్న రీతిలో అతని వ్యవహారశైలి ఉందని ఆరోపిస్తున్నారు. సాధారణంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను మండల స్థాయి కార్యాలయం నుంచి ఉపాధ్యాయులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేస్తుంటారు. అయితే ఆ స్థానంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఆర్డర్లు వేస్తూ.. సమావేశంలో కించపరిచేలా మాట్లాడటాన్ని ఉపాధ్యాయులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఉన్నత చదువులు చదివి సుదీర్ఘ కాలంగా విధులు నిర్వర్తిస్తున్న తమతో ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అమర్యాదగా ప్రవర్తించడంపై మనస్తాపానికి గురవుతున్నారు. సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఎంఈఓ కిషోర్‌బాబును వివరణ కోరగా.. అటువంటివి మరలా జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కూల్ డ్రింక్ షాపు దగ్ధం

- రూ.2 లక్షల మేర నష్టం



అగ్నికి ఆహుతైన ఫ్రిజ్‌లు

పుల్లలచెరువు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి కూల్ డ్రింక్ దుకాణం దగ్ధమైన సంఘటన మండలంలోని నర్వ తండాలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని కొమరోలుకు సమీపంలో హైవేపై నర్వ తండాకు చెందిన బి.తేజానాయక్ కూల్ డ్రింక్స్, రిటైల్ షాపు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో షాపులోని సుమారు రూ.50 వేల విలువైన ఫ్రిజ్‌లు, రిటైల్ సరుకులు, రూ.లక్ష నగదు, మూడు ప్రామిసరీ నోట్లు, రూ.30 వేల విలువైన టీవీ, రూ.15 వేల విలువైన ఫోన్లు పూర్తిగా కాలిపోయాయి. అధికారులు పరిశీలించి తగిన పరిహారం అందజేయాలని బాధితుడు వేడుకొంటున్నాడు.

ఆర్టీసీ బస్సులో సీటు కోసం వివాదం

ఒంగోలు టౌన్: ఆర్టీసీ బస్సులో సీటు కోసం జరిగిన వివాదం కాస్త చిలికి చిలికి ఘర్షణగా మారింది. పోలీసుల కథనం ప్రకారం... ఒంగోలుకు చెందిన దివి రమేష్ బాబు మద్దిపాడు మండలంలోని దొడ్డవరలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తుంటారు. ప్రతిరోజూ ఒంగోలు నుంచి వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం విధులు ముగించుకొని మద్దిపాడులో ఆర్టీసీ బస్సు ఎక్కారు. సీటులో అప్పటికే ఒంగోలు బిలాల్నగర్కు చెందిన షేక్ కరీముల్లా అనే ఆటో డ్రైవర్ కూర్చొని ఉన్నాడు. సీటు దగ్గర వీరిద్దరి మధ్య గొడవ జరిగి ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నారు. ఈ విషయాన్నీ కరీముల్లా తన బంధువులకు ఫోన్ చేసి చెప్పాడు. బస్సు పోతురాజు బ్రిడ్జి వద్దకు రాగానే కరీముల్లా బంధువులు వచ్చి బస్సును ఆపి రమేష్బాబుపై దాడి చేసి గాయపరిచారు. ఒకరిపై మరొకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆగస్టు 31 వరకు పోలీసు యాక్ట్ అమలు

ఒంగోలు టౌన్: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఆగస్టు 1 నుంచి 31వ తేదీ వరకు ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు యాక్ట్ అమల్లో ఉన్నందున పోలీసుల అనుమతి లేకుండా ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించరాదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్వగ్రామానికి వెళ్తుండగా..

- స్కూటీని ఢీకొట్టిన మినీలారీ
- బేల్దారి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

కావలి(జలదంకి): కావలి రూరల్ మండలం గౌరవరం సమీపంలోని అటవీ మొక్కల పెంపక కేంద్రం వద్ద జాతీయ రహదారిపై గురువారం స్కూటీని వెనుక నుంచి చిన్న మినీలారీ ఢీకొట్టింది. ప్రమాదంలో మనకే ఉదయ్‌కిరణ్ (24) అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మనకే మహేష్ తీవ్రంగా గాయపడ్డాడు. రూరల్ పోలీసుల కథనం మేరకు.. పొన్నలూరు మండలం చెన్నుపాడుకు చెందిన మహేష్ నాయుడుపేటలో బేల్దారి పనులు చేయిస్తుంటాడు. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన కొంతమందితో పాటు వరుసకు సోదరుడైన ఉదయ్‌కిరణ్‌ను కొంతకాలంగా నాయుడుపేటకు తీసుకెళ్లి పనులు చేయిస్తున్నాడు. మహేష్ చెల్లెలుకు పెళ్లి కుదిరింది. అతడితో పాటు ఉదయకిరణ్ స్కూటీపై స్వగ్రామానికి బయలుదేరారు. గౌరవరం వద్ద జాతీయ రహదారిపై మినీలారీ స్కూటీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉదయ్‌కిరణ్ తలపై కంటైనర్ టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన మహేష్‌ను చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. ఉదయ్‌కిరణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు. మృతుడి తండ్రి తిరుపాలు ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై తిరుమలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ ఏటీఎం కార్డులిచ్చి..

ఆత్మకూరు: నగదు తీసుకునేందుకు ఏటీఎంల వద్దకు వెళ్లే వారిని మోసం చేసి కార్డు, పిన్ నంబర్లను తెలుసుకుని నగదు దోచుకుంటున్న వ్యక్తిని కొందరు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. స్థానికులు, ఎస్సై జిలానీ కథనం మేరకు.. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం మట్టిపాడు గ్రామానికి చెందిన సురేంద్ర అనే యువకుడు ఏటీఎంల వద్ద ప్రజలను ఏమారుస్తుంటాడు. నగదు విత్‌డ్రా చేయాలని కోరుతూ కార్డులిచ్చే వారిని మోసం చేస్తుంటాడు. పిన్ నంబర్ తెలుసుకుని నకిలీ కార్డు చేతిలో పెడుతుంటాడు. గురువారం ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ సమీపంలోని ఓ బ్యాంక్ ఏటీఎం వద్ద వృద్ధుడికి నగదు తీసుకోవడంలో సహాయం చేస్తానని నమ్మించాడు. ఆయన కార్డు తీసుకుని పిన్ నంబర్ తెలుసుకుని నగదు డ్రా చేసి నకిలీ కార్డు ఇచ్చాడు. కొద్దిసేపటి అనంతరం మరో యువకుడికి ఇలానే చేయబోగా సురేంద్ర మోసాన్ని పసిగట్టి సమీపంలోని వారి సహకారంతో పట్టుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై పరిశీలించగా సురేంద్ర వద్ద పలు నకిలీ ఏటీఎం కార్డులు లభించాయి. అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. ఇప్పటికే కేసులు నమోదైనట్లు గుర్తించారు.